



మాట్లాడుతున్న బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి



సహకార సంఘాల్లో అక్రమాలు!



- జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నిధుల దుర్వినియోగం
- తవ్విన కొద్దీ బయటపడుతున్న అక్రమాలు
- ఇప్పటికే కొన్ని సొసైటీల పరిధిలోని ఉద్యోగులపై వేటు
- అవకతవకలు జరిగిన సొసైటీల పరిధిలోని నిధుల వసూళ్లకు చర్యలు
- వచ్చేనెల 19న పూర్తికానున్న సొసైటీ పాలకవర్గాల పదవీకాలం
- సొసైటీల పరిధిలో పెరిగిపోతున్న ప్రజాప్రతినిధుల జోక్యం

నిజామాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో తవ్విన కొద్దీ అక్రమాలు బయట పడుతున్నాయి. పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతున్న సమయంలో పలు సంఘాల పరిధిలో నిధుల దుర్వినియోగం వెలుగులోకి వస్తోంది. కొన్ని సంఘాల పరిధిలో సీఈవోల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఇష్టం వచ్చిన రీతిలో ఖర్చు చేయగా, మరికొన్ని సంఘాల పరిధిలో లక్షలాది రూపాయల అక్రమాలు బయటపడుతున్నాయి. ఐదేళ్ల కాలంలో జిల్లాలోని కొన్ని సంఘాలకు ధాన్యం కొనుగోళ్ల ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తోంది. ఈ ఆదాయంతో పాటు ఎరువుల అమ్మకాలు, రైతులకు రుణాలు ఇవ్వడం వల్ల వచ్చే ఆదాయం నుంచే ఖర్చు చేయాల్సి ఉన్నా.. ఇతర నిధులను కూడా అనుమతులకు మించి వినియోగించడం వల్ల చాలా సంఘాలు అప్పుల్లోకి కూరుకుపోయాయి. గడిచిన కొన్ని నెలలుగా సంఘాల పరిధిలో ఆడిటింగ్ చేస్తుండగా అక్రమాలు బయటపడుతున్నాయి. కొన్ని సంఘాల పరిధిలోని సీఈవోలను ఇప్పటికే పక్కకు పెట్టగా మరికొందరిపై వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని సంఘాల పరిధిలోని ఆస్తులను అమ్మి బకాయిలను చెల్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో 89 సొసైటీలు

జిల్లా వ్యాప్తంగా 89 సొసైటీల పరిధిలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. సొసైటీల పరిధిలో రైతులకు కావాల్సిన విత్తనాలను అందించడంతో పాటు ఎరువులను సరఫరా చేస్తున్నారు. ఇవే కాకుండా గత కొన్నేళ్లుగా సహకార సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను చేస్తున్నారు. వీటిమీద వచ్చే వడ్డీ, కమీషన్‌ల ద్వారానే సహకార సంఘాలను నిర్వహించాలి. సిబ్బందికి జీతాలను కూడా వీటి నుంచే అందించాలి. జిల్లాలో కొన్ని సొసైటీలు ఆర్థికంగా బలంగా ఉన్నా మరికొన్ని సొసైటీలు అప్పుల్లో కూరుకుపోయాయి. కనీసం జీతాలు చెల్లించని పరిస్థితుల్లో ఉన్నాయి. జిల్లాలో ఉన్న ఈ సొసైటీల పరిధిలో ప్రతీ సంవత్సరం రెండు దఫాలు జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తారు. సొసైటీ పరిధిలోని లావాదేవీలన్నీ చర్చిస్తారు. అప్పులకు సంబంధించిన వివరాలను కూడా పరిశీలిస్తారు. వాటిపై జనరల్ బాడీలో చర్చిస్తారు.

నిధుల పక్కదారి

జిల్లాలోని మాక్లూర్, పోతంగల్, సిరికొండ, ఎత్తొండ, సావెల్, పడగల్, కోనసముందర్‌తో పాటు పలు సంఘాల పరిధిలో ఎక్కువ మొత్తంలో నిధులు పక్కదారి పట్టాయి. ఇవేకాకుండా మరో 20 సొసైటీల పరిధిలో నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించి తనిఖీలు చేస్తున్నారు. మరికొన్ని సొసైటీల పరిధిలో వాటికున్న ఆస్తులను విక్రయించి బకాయిలను కట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఒకటి రెండు సొసైటీల పరిధిలో రైతుల నిధులను కూడా పక్కదారి పట్టించడంతో వారిపైన దర్యాప్తు చేస్తున్నారు. సొసైటీల లావాదేవీల కోసం మార్క్‌ఫెడ్ నుంచి అరువుపై ఎరువులను ఇస్తే అమ్ముకొని బకాయిలను కట్టలేదు. జిల్లాలో ఇలాంటి సొసైటీలు 13వేలకు ఉన్నాయి. ఒక్కొక్క సొసైటీ రూ.20లక్షల నుంచి కోటి వరకు మార్క్‌ఫెడ్‌కు బకాయిలు పడ్డారు. ఎరువులు ఇచ్చిన తర్వాత వచ్చే డబ్బులను మార్క్‌ఫెడ్‌కు చెల్లించాల్సి ఉన్నా స్థానిక అవసరాలకు సొసైటీల పరిధిలో వాడుకోవడంతో మార్క్‌ఫెడ్ నుంచి ఎరువులు ఇవ్వని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సొసైటీలకు వచ్చే ధాన్యం కొనుగోలు కమీషన్‌ను అధికారులు మార్క్‌ఫెడ్‌కు మళ్లించి బకాయిలను చెల్లిస్తున్నారు. సొసైటీల పరిధిలో ఎరువులను అమ్మితే వెంటనే కమీషన్ ఉంచుకొని బకాయిలను జమ చేయాలి. కొన్ని సొసైటీల పరిధిలో చేయకపోవడం వల్ల ప్రస్తుతం చెల్లించని పరిస్థితి ఉంది. జిల్లాలోని చాలా సొసైటీల పరిధిలో ఈ పరిస్థితి నెలకొంది. కొన్ని సొసైటీల పరిధిలో నిధులు తక్కువగా ఉన్న పాలకవర్గాలు నిర్ణయం తీసుకొని గోదాములు కట్టడం వల్ల ఎక్కువ మొత్తంలో అప్పులు అయ్యాయి. ఈ అప్పులు చెల్లించేందుకు ఈ సొసైటీల పరిధిలోని ఆస్తులు అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. గడిచిన కొన్నేళ్లుగా సొసైటీల పరిధిలో ప్రజాప్రతినిధుల జోక్యం ఎక్కువగా పెరిగిపోవడం వల్ల నిధులు పక్కదారి పట్టిన అధికారులు చర్యలు తీసుకునే పరిస్థితి ఉండటం లేదు. ప్రతీ సంవత్సరం జరిగే ఆడిటింగ్‌లో పరిశీలిస్తున్న చర్యలు చేపట్టే సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకురావడం వల్ల వదిలి వేస్తున్నారు. జిల్లాలో సొసైటీల పరిధిలో జరిగిన అక్రమాలపై ఇప్పటి వరకు నలుగురిని సస్పెండ్ చేశారు. మరో 20 మంది వరకు నోటీసులను జారీ చేశారు. జిల్లాలో సొసైటీల పాలకవర్గాల పదవీకాలం నెలరోజులలోపే పూర్తవుతుండటంతో అధికారులు కూడా వీటిపై నజర్ పెట్టి వివరాలను పరిశీలిస్తున్నారు. పాలకవర్గాలు ముగిసే లోపే మరికొన్ని సొసైటీల్లోనూ లావాదేవీలను పరిశీలించేందుకు సిద్ధమవుతున్నారు.

ఫిబ్రవరి 19న ముగియనున్న పదవీ కాలం

జిల్లాలో మొత్తం 89 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని పాలకవర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 19న ముగియనుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని సొసైటీ డైరెక్టర్లతో పాటు చైర్మన్‌ల పదవీకాలం నెలరోజుల్లోపే ఉంది. ఐదేళ్లు పూర్తవుతున్నా సమయంలో ఎన్నికలు నిర్వహించి మళ్లీ కొత్త పాలకవర్గం సభ్యులను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం నెలరోజులే సమయం ఉండటం వల్ల సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ఇంకా నిర్ణయించనట్లు సమాచారం. సహకార సంఘాల పదవీకాలం పూర్తవుతున్న 45 రోజుల ముందే ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకోనందున పదవీకాలం పూర్తయిన తర్వాత పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎనిమిది నూతన సొసైటీలకు విజ్ఞప్తులు

జిల్లాలో సొసైటీలు అప్పుల్లో నడుస్తుండగా.. కొత్త సొసైటీల కోసం కూడా ఎక్కువగా విజ్ఞప్తులు వస్తున్నాయి. జిల్లాలో ఎనిమిది చోట్ల కొత్త సొసైటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులు లేఖలను పంపిస్తున్నారు. జిల్లాలోని లక్ష్మీపూర్, పగిడెపల్లి, వన్నెల్-బి, జన్నేపల్లి, సిద్ధాపూర్, తగిలేపల్లి, దేగాం, తిమ్మాపూర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోందని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సొసైటీల పరిధిలోనూ లావాదేవీలు సక్రమంగా జరిగే విధంగా చూస్తున్నామన్నారు. అవకతవకలు జరిగిన నాలుగు సొసైటీల పరిధిలోని ఉద్యోగులను విధుల నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు. మిగతా సొసైటీల పరిధిలోనూ చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ప్రతీసారి.. అంబేద్కర్‌ను అవమానిస్తోంది

- సీఎం రేవంత్‌రెడ్డి పరిధి దాటి అప్పులు చేస్తున్నారు
- బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ప్రతీసారి అవమానాలకు గురిచేస్తోందని బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగ సంవిధాన్ గౌరవ దివస్ వర్క్‌షాప్ కార్యక్రమానికి మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎఫ్ఆర్‌బీఎం పరిధిని దాటి విపరీతమైన అప్పులు చేస్తున్నారన్నారు. అప్పులు చేసినా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోతోందన్నారు. పసుపు బోర్డు ప్రకటించడం అభినందనీయమని, దేశానికే గర్వకారణమని అన్నారు. రాష్ట్రంలో గత 13 నెలల కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలను ఆధారాలతో బయట పెట్టినా స్పందించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన పూర్తిగా అవినీతిమయంగా మారిందన్నారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వ పథకాలకు డాక్టర్ అంబేద్కర్ పేరును పెట్టలేదన్నారు. కేవలం గాంధీ పరివార్ పేర్లను మాత్రమే పెట్టుకుందన్నారు. నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 26 నవంబరు 2015న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించిందన్నారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22, 23 తేదీలలో ఎస్సీ, ఎస్టీ బస్తీలలో సమావేశాలు, 24, 25న కళాశాలలు, హాస్టళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలు, రాజ్యాంగం పట్ల బీజేపీ నిబద్ధతను తెలియజేయడం, జనవరి 26న ప్రతీ బూత్‌లో గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవాలని పార్టీ శ్రేణులను మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, స్రవంతిరెడ్డి, నక్కరాజేశ్వర్, పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌పై కవిత మాట్లాడటం హాస్యాస్పదం

: బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రోటోకాల్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్ పాటించారా అని ప్రశ్నించారు. పసుపుబోర్డుపై మాట్లాడే అర్హత కవితకు లేదన్నారు. కవిత త్రిముఖ వ్యూహంపై మాట్లాడుతుందని వాళ్ల కుటుంబ త్రిముఖ వ్యూహం ఏందో ప్రజలం దరికీ తెలుసన్నారు. ప్రతీ మూడేళ్ల కోసారి పసుపుధర పెరుగుతుందని అందులో అర్వింద్ గొప్పతనం ఏమీలేదని కవిత చెబుతున్నారని కవిత ఐదేళ్లు ఎంపీగా ఉన్నప్పుడు పసుపుధర ఎందుకు పెరగలేదన్నారు. వేల్పూర్‌లో స్పైసెస్ బోర్డు కోసం 42ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినప్పుడు కనీసం ఒక్క వ్యవసాయాధార పరిశ్రమను ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్లు ప్రవళిక, మెట్టు విజయ్, సుక్కమధు, సుధీర్, ఇందిర, వనిత, బైకన్ సుధా, సుమిత్ర, హేమలత పాల్గొన్నారు.

ఫొటో..ఫీట్...



గ్రామసభల్లో రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

: జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి నిర్వహించనున్న గ్రామ సభలల్లో నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్ రెడ్డి తెలిపారు. నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు విధానం, కార్డులో నతనంగా పేర్ల ఎంట్రీ తదితర వివరాలను 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కడ దరఖాస్తుచేసుకోవాలి?

డీఎస్‌వో: నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ సభలల్లో రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా రేషన్ కార్డు లేనివారి జాబితా ప్రభుత్వం వద్ద ఉంది.

ఆంధ్రజ్యోతి: గ్రామ సభలలో రేషన్ కార్డులు లేనివారి జాబితాలో పేరు లేకుంటే ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?

డీఎస్‌వో: గ్రామ సభలలో రేషన్ కార్డు లేనివారు పేర్లను ప్రకటించిన తర్వాత ఇంకా కూడా ఎవరైనా అర్హులు ఉంటే రేషన్ కార్డుల కోసం మండలాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ. ప్రజలు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: రేషన్ కార్డులలో కుటుంబ సభ్యులను ఏ విధంగా చేర్చుకోవాలి?

డీఎస్‌వో: రేషన్ కార్డులలో పేరు లేని వారు కుటుంబ సభ్యుల పేర్లను మీ సేవలలో దరఖాస్తు చేయడం ద్వారా చేర్చుకోవచ్చు. జిల్లాలో ఇప్పటికే లక్షా 27వేల 427 మంది పేర్లు జతచేయాల్సి ఉంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోగానే వాటిని రేషన్ కార్డులలో చేరుస్తాం. ఇంకా ఎవరైనా పేరు నమోదు చేయాలనుకుంటే మీసేవల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

(ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ అర్బన్)

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే రిపబ్లిక్‌డే సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన శకటాలను ప్రదర్శించాలని ఆయన సూచించారు. వీటితో పాటు గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతురుణ మాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ప్రాధాన్యతను చాటేలా శకటాలను ప్రదర్శించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశుసంక్షేమ, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు గాను శాఖల వారిగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు అందించాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యం ఇస్తూ ఈనెల 22వ తేదీలోగా పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫారసు చేయాలన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, అదనపు డీసీపీ బస్వా రెడ్డి, డీఆర్‌డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

చందూర్ మండల కేంద్రంలో కలెక్టర్ పర్యటన..

మోస్రా: చందూర్ మండల కేంద్రంలో సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ శాంతతో రైతు భరోసా విషయాలపై చర్చించారు. అదే విధంగా ఎంపీడీవో నీలావతితో గ్రామసభలు సుజావుగా సాగేలా చూడాలని, మండల ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి చెప్పాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ యోగ్యంలో లేని భూములను పక్కాగా గుర్తించాలి : కలెక్టర్

రుద్రూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యోగ్యంలో లేని భూములను పక్కాగా గుర్తించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. ప్రభుత్వం అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, రూపొందించిన వివరాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తనిఖీ చేశారు. సోమవారం మండలంలోని అక్బర్‌నగర్, రుద్రూర్ గ్రామాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సందర్శించారు. అక్బర్‌నగర్ గ్రామ శివారులోని భూములతో పాటు రుద్రూర్ బస్టాండ్ వెనక భాగాన 897 నుంచి 957 వరకు గల సర్వే నెంబర్లలోని భూములకు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు, తదితరులు ఉన్నారు.



రుద్రూర్‌లో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నా..

- కలెక్టర్‌కు బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి లేఖ

నిజామాబాద్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి సంవత్సరమైనా నిలబెట్టుకోని కారణంగా దానికి నిరసనగా తన నియోజకవర్గంలో నిర్వహించే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో 18 ప్రకారం చెక్కుల పంపిణీ కేవలం స్థానిక ఎమ్మెల్యే ప్రొటోకాల్‌లో ఉందని, స్థానిక ఎమ్మెల్యే అభీష్టం ప్రకారం ఈ కార్యక్రమం జరగాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను గుర్తు చేస్తూ హైకోర్టు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించిందని ఆయన తెలిపారు. ఈ దఫా చెక్కులను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో నేరుగా లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే తులం బంగారం పథకాన్ని మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు.

సమాధానం చెప్పలేకనే ఎమ్మెల్యే పక్కకు తప్పుకున్నారు..

: రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల

ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడిన బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనకుండా ప్రభుత్వంపై నిందలు వేయడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న చివరి రెండు సంవత్సరాలలో పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుంటే వాటిని పంచే కార్యక్రమంలో వేల్పూర్, భీంగల్, ముప్కాల్, కమ్మర్‌పల్లి ప్రాంతాలలో ప్రజలు ప్రశాంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రజలకు జవాబు చెప్పుకోలేక చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నట్లు డ్రామాలు ఆడుతూ పక్కకు తప్పుకున్నారని అన్నారు. కేవలం తులం బంగారం ఇవ్వడం లేదనే సాకుతో ప్రశాంత్‌రెడ్డి చెక్కుల పంపిణీని బహిష్కరిస్తే గత ఏడాది కాలంగా ఎందుకు చెక్కులు పంపిణీ చేశారో జవాబు చెప్పాలన్నారు. గ్రామాలలో మహిళలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న చివరి రెండు సంవత్సరాలు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నిస్తున్నందువల్లే ఏం సమాధానం చెప్పాలో తెలియక కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేసి పక్కకు తప్పుకోవడం సిగ్గుచేటని దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

'అక్రమ వెంచర్'పై అధికారుల విచారణ

- వన్నెల్(కె)లో రెవెన్యూ, పంచాయతీ అధికారుల సర్వే
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు

నందిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నెల్(కె) గ్రామంలో 390/2/4, 391/3, 398/3/3సర్వే నెంబరులో గల ఎకరం పది గుంటల భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్, నిర్మాణాలపై సోమవారం మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు విచారణ చేపట్టారు. అసైన్‌మెంట్ భూమిలో సుమారు 25ప్లాట్లుగా మార్చి విక్రయించడం, కొనుగోలు చేసిన వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండానే పర్మినెంట్ నిర్మాణాలు చేపట్టడంతో ఈ నెల 12వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'అసైన్డ్‌లో వెంచర్' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు ఉమ్మడి సర్వే చేపట్టారు. అసైన్డ్ భూమిలో ఎటువంటి ప్లాట్లు, నిర్మాణాలు చేపట్టరాదని అధికారులు హెచ్చరించారు. విచారణ, సర్వే వివరాల నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలేఖ, పంచాయతీ కార్యదర్శి అఖిల్ తదితరులు ఉన్నారు.

నేటి పాదయాత్రను జయప్రదం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జనవరి 21న జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి, గౌతంనగర్, చంద్రశేఖర్ కాలనీ, వినాయక్‌నగర్ లోగల పీహెచ్‌సీలలో మెడికల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జనవరి 21న బోర్గాం బ్రిడ్జి నుంచి పూలాంగ్ చౌరస్తా మీదుగా ధర్నాచౌక్ వరకు పాదయాత్ర ఉంటుందని తెలిపారు. ధర్నాచౌక్‌లో ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశావర్కర్లకు ఖచ్చితమైన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 25 నుంచి అక్టోబరు 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2023లో నిరవధిక సమ్మె నిర్వహించామని ఆనాటి సందర్భంలో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ చర్చలు జరిపి నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భం గా కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఆశావర్కర్లకు వేతనాలు పెంచుతామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని ఇప్పటి వరకు హామీలను నెరవేర్చడం లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రేవతి, బాలామణి, లలిత, మానస, రేణుక, రేఖ, రాజకళ, లలిత పాల్గొన్నారు.

కోటగిరి: ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశంలో ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని సీఐటీయు నాయకులు నన్నేసాబ్ డిమాండ్ చేశారు. పోతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ కార్యదర్శి రేష్మ, స్రవంతి, పుష్పలత, నాగమణి, కళావతి, లింగమణి, లత, అనిత పాల్గొన్నారు.

బీర్కూర్‌లో సైబర్ మోసం



బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫోన్‌లో ప్రకటనను చూపుతున్న గంగారాం

బీర్కూర్,జనవరి 20(ఆంధ్ర జ్యోతి): బీర్కూర్ మండల కేం ద్రంలో ఒక యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రకటన చూసి ఆకర్షితుడయ్యాడు.ఆప్రకటనలో ఉన్న కాంట్రాక్ట్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. వారి మాయ మాటలను నమ్మిన యువకుడు రూ.1.80 లక్షలు పోగొట్టుకుని మోసపోయిన యువకుడు. వివరా లు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రా నికి చెందిన నర్ర గంగారాం అనే యువకుడు హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు. సంక్రాంతి పండు గకు బీ ర్కూర్‌కు వచ్చాడు. ఇదిలా ఉండగా తన ఫోన్‌లో ఇన్‌స్టా గ్రామ్ ఓపెన్ చేసి చూస్తుండగా పాత నాణేలు తీసుకుని 99 లక్షలు ఇస్తామని ఒక ప్రకటనలో కనిపించింది. గంగారాం వెంటనే ప్రకటనలో ఉన్న కాంటాక్ట్ నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. అంతే అవతలి వ్యక్తి గంగారాంకు మాయ మాటలు చెబుతూ విడతల వారీగా 1.80 లక్షలు తన అకౌంట్‌లోకి వేయించుకున్నాడు. మరికొంత డబ్బు వేయాలని అప్పుడు ప్రాసెస్ మొత్తం పూర్తి అవుతుందని నమ్మబలికాడు. ప్రాసెస్ పూర్తి అయిన వెంటనే 99 లక్షలని బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని చెప్పాడు. తాను మోసపోయానని గంగారాం గ్రహించాడు. బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అంక్సాపూర్‌లో వారంతపు సంత ప్రారంభం



అంక్సాపూర్‌లో సంతను ప్రారంభిస్తున్న వీడీసీసభ్యులు

వేల్పూర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వారంతపు సంతను వీడీసీసభ్యులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలోని వీడీసీ ఆధ్వర్యంలో హన్మాన్ ఆలయం వద్ద ఈ వారంతపు సంత (అంగడి) ఏర్పాటు చేశారు. ఈ సంత ప్రతీ సోమవారం నిర్వహించడం జరుగుతుందని ఈ సంతను స్థానిక గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

బోధన్‌రూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): బోధన్‌పట్టణంలో అత్యధిక మోతాదులో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయాధికారి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కన మద్యం తాగి ఐదుగురు వ్యక్తులను కోర్టులో హాజరుపర్చగా వారికి కమ్యూనిటీ సర్వీస్ పర్మిమెంట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈసందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ ప్రతిరోజు బోధన్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.యువత పట్టణ శివారులోని బహిరంగ ప్రదేశాలలో మద్యంతాగి చర్యలుతప్పవని హెచ్చరించారు.

ప్రమాదబీమా చెక్కు పంపిణీ

ఆర్మూర్‌టౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గాయత్రి బ్యాంకులో సోమవారం ప్రమాదబీమా చెక్కును పంపిణీ చేశారు. ఇటీవల కొత్త నాగరాజు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించడంతో నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా వల్ల రూ.లక్ష చెక్కును మృతుని భార్య ముల్కి గంగాజమునకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, బ్రాంచ్ మేనేజర్ చందూర్ రాజశేఖర్, పాల్గొన్నారు.

నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి సన్మానం



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్

జక్రాన్‌పల్లి, జనవరి20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సంవిధాన్ గౌరవ దివాస్ వర్క్‌షాప్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో బీజేపీ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాసనపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మలేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి శాలువ, పూలమాలతో సత్కరించారు. బీజేపీ నాయకులు క్యాతం రాజారెడ్డి, జక్కం కార్తిక్, తిరుపతిరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



బోధన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): సీపీఎం పార్టీ 4వ రాష్ట్ర మహసభలను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ బోధన్ కార్యదర్శి శంకర్ గౌడ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని తాలూకా రైస్‌మిల్ అసోసియేషన్ భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు మహలక్ష్మి పేరుతో ఇస్తానన్న 2500రూపాయలు ఉచితంగా అందించాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ నిరంతరం ప్రజలపై భారం వేస్తుందే తప్ప అభివృద్ధి చేయడం లేదని ఆరోపించారు. దేశంలోని కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి కేంద్ర ప్రభుత్వం నెట్టి వేస్తుందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెల 25నుండి సంగారెడ్డి పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ సభకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కుమార స్వామి, ఏశాల గంగాధర్, దాసి, రవి, నాగరాజు, రాజు, హన్మాండ్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: ఈ నెల 25నుంచి 28వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర 4వ మహసభలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. 25న సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ గ్రౌండ్‌లో భారీబహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశానికి అఖిల భారత సీపీఎం పార్టీ సమన్వయకర్త కామ్రేడ్ ప్రకాష్ కారత్, కామ్రేడ్ బృంద కారత్, కామ్రేడ్ బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తదితర నాయకులు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవేందర్ సింగ్, షేక్ మహబూబ్, వసంత్, సావిత్రి తదితరులున్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రీనగర్ సీపీఐఎం కార్యాలయంలో సీపీఐఎం నాయకులు సోమవారం సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25నుంచి 28వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, రాబోయే మూడేళ్ళ ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని, మహాసభను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, నాయకుడు భూమన్న, కుల్‌దీప్‌శర్మ, ఓంకార్, సజిద్‌ఖాన్, ఖలీం, పాల్గొన్నారు.

అంకాపూర్ సొసైటీ పాలకవర్గంపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

● మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి



అంకాపూర్‌లో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

ఆర్మూర్‌రూరల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): అంకాపూర్ సొసైటీ పాలకవర్గ సభ్యులపై గ్రామానికి చెందిన వినోద్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకాపూర్ పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సొసైటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గత 11ఏళ్లకు సంబంధించిన సొసైటీ లావాదేవీలు, లాభనష్టాలను సభ్యుల ముందు బహిర్గతం చేశారు. భవిష్యత్‌లో సొసైటీని, గ్రామాన్ని అప్రదిష్టపాలు చేస్తే సహించేదిలేదని పాలకవర్గ సభ్యులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నవీన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, సీఈవో శ్యామ్, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

● అంకాపూర్ సొసైటీని తనిఖీ చేసిన అధికారులు

ఆర్మూర్ మండలం అంకాపూర్ పీఏసీఎస్ కార్యాలయాన్ని సోమవారం క్లస్టర్ అధికారిణి స్వప్న, మానిటరింగ్ అధికారి రవీందర్‌సింగ్ తనిఖీ చేశారు. వారు సంఘ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల సంఘంలో పాలకవర్గ సభ్యులపై గ్రామానికి చెందిన వ్యక్తి పలు ఆరోపణలు చేసిన దృష్ట్యా అధికారులు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో సంఘ పాత భవనం విక్రయించగా వచ్చిన డబ్బులను సొసైటీ ఖాతలో జమ చేసినట్లు పాలకవర్గ సభ్యులు అడిట్ అధికారులకు వివరించారు. అధికారులు సంఘ జమ ఖర్చులను పరిశీలించారు.

అంటు వ్యాధులపై అవగాహన సదస్సు

ఏర్గట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యాశాఖ అలాగే ఎన్‌జీవో సంయుక్త ఆధ్వర్యంలో బాలిక విద్యార్థులకు అంటు వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. అందులో యుక్త వయస్సులో బాల బాలికలకు ఎలాంటి వాధ్యులు ప్రబలుతాయో, అలాంటి వ్యాధుల పట్ల ఎలాంటి అవగాహన కలిగి ఉండాలో తెలుపుతూ,హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల గురించి కోర్సు డైరెక్టర్ మల్లికార్జున్, అలాగే సరితలు వివరించారు. అనంతరం పలు అంశాలపై పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతుల ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం కృష్ణచారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మల్ల సాయిలు

రెంజల్,జనవరి20(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు ఇంటికోక డప్పు చొప్పున లక్షలాదిగా హైదరాబాద్‌కు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మల్ల సాయిలు పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన నిజామాబాద్‌లో నిర్వహించే సదస్సుకు విచ్చేస్తున్న మందకృష్ణ మాదిగ సమావేశానికి మాదిగ సోదరులు సభకు హాజరై సదస్సును విజయవంతం చేసి ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమానికి తరలివెళ్లి మాదిగల సత్తా చూపించాలని పేర్కొన్నారు.

మైనారిటీ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో 2025-26విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షియా నజ్మా ఓ ప్రకటనలో తెలిపారు. మైనారిటీ, మైనారిటీ యేతర విద్యార్థులు టీజీఎంఆర్ఈఐఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28వ తేది వరకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలి

బోధన్‌రూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో రేషన్ కార్డు దరఖాస్తు చేసుకున్న వారు సుమారు 300లకు పైగా ఉండగా కేవలం 68మందికి మాత్రమే రేషన్ కార్డు జాబితాలో పేర్లు రావడం శోచనీయమని అమ్దాపూర్ గ్రామస్థులు, బీజేపీ నాయకులు అన్నారు. సోమవారం బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డులు రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, స్కాలర్ షిప్‌లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి వెంటవెంటనే అందేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జీలకరి ప్రవీణ్, శ్రీనివాస్, లింగం, శివ, నీరడి బాబు రావు, సాయి, ఆరె పవన్, ప్రశాంత్, గాండ్ల రాజేశ్వర్ ఉన్నారు.

పురుషులకు కుని ఆపరేషన్ శిబిరాన్ని సక్సెస్ చేయాలి

కమ్మర్‌పల్లి, జనవరి 20: (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 23న నిర్వహిపనున్న పురుషుల కుటుంబ నియంత్రణ శాస్త్రచికిత్స శిబిరం విజయవంతంఅయ్యేలా చూడాలని వీలైనన్ని ఎక్కువ కేసులు శిబిరానికి తరలించాలనిడిప్యూటి డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలాలలో వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. మగవారికి కుని ఆపరేషన్‌లవల్ల ఇబ్బందులు ఎమి ఉండవని ఏలాంటి కోతలు కుట్లు లేకుండా ఈ ఆపరేషన్‌లు జరుగుతాయని ఈ విషయాలను క్లుప్తంగా వివరిస్తు మోటివేట్ చేయాలని అదేశించారు. అంతకు ముందు సిబ్బందితో రివ్యూ సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ స్పందన, హెచ్‌వో సత్యనారాయణ మలేరియానియంత్రణ అధికారి సాయన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభు త్వ ఆసుపత్రిలో ఈనెల 23న పురుషుల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరం నిర్వహిస్తు న్నామని వైద్యాధికారులు రమేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు శాస్త్రచికిత్స శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.ఈశిబిరంలో కమ్మర్‌పల్లి చౌట్‌పల్లి, భీమ్‌గల్,వేల్పూర్, ఏర్గట్ల ప్రాథమికఆరోగ్య కేంద్రాల వైద్యాధి కారులకు సూపర్‌వైజర్, ఎఎన్ఎం, ఆశకార్యకర్తలకు కేసులను తీసు కురావాలని ఆదేశించారు. ఎన్ఎస్‌వీ క్యాంప్ ను విజయవంతం చేయాలని డాక్టర్ సునిత, వైద్యాధికారి తెలిపారు.



చౌట్‌పల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్

ఎస్సీవర్గీకరణను సత్వరమే చేపట్టాలి

● మాదిగ ఉపకులాల భారీ ర్యాలీ

మోర్తాడ్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో పది గ్రామాలకు చెందిన మాదిగ, మాదిగ ఉపకులాల భారీ ర్యాలీ నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీవర్గీకరణ సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి భారీగా ర్యాలీ నిర్వహిస్తూ ప్రధానవీదులగుండా డప్పు లతో ర్యాలీ నిర్వహించారు.తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీవర్గీకరణ చేపడతామని మాట ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్న ఇంత వరకు వర్గీకరణ చేపట్టలేదని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బాల్కొండ శాసనసభ ఇన్‌చార్జీ ప్రభాకర్, మచ్చ దేవేందర్, పోశెట్టి, తెడ్డు గంగారాం,రవి,సుమన్, గంగాధర్, నాగభూషణం, పది గ్రామాలకు చెందిన మాదిగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఏర్గట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన మహమ్మద్ షరీఫ్ గత కొంత కాలంగా వెన్నునొప్పి సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓకార్పొరేట్ ఆసుపత్రిలో చేరగా, ఆపరేషన్‌కై బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ రూ.2లక్షల 50 వేల ఎల్‌వోసీ మంజూరు చేయించగా బాధిత కుటుంబ సభ్యులు సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఆస్ట్రేలియాలో స్వాగతం



ఆస్ట్రేలియాలో టీపీసీసీ అధ్యక్షుడి సన్మానిస్తున్న భోజారెడ్డి

డొంకేశ్వర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సోమవారం ఆస్ట్రేలియా ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికారు. ఉమ్మడి మండలాల లిఫ్ట్ చైర్మన్ అధ్యక్షుడు బోజారెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్వాగతం పలికి శాలువ, పూలబొకెతో ఘనంగా సన్మానించారు.

కోటగిరిలో ఉపాధ్యాయుల నిరసన

కోటగిరి,జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల పై దాడులు చేయడం తగదన్నారు. దాడిచేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రావు,లోల శంకర్, పీఆర్టీయూ నాయకులు బర్ల సాయిలు, ఉదయ చందర్, బస్వంత్‌రావు,శివకుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుకూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంప్రభాకర్, ఉపాధ్యాయులు దీపిక, రవీందర్,రవి, శకుంతల, ఇందిరా, అనిత, శ్యామ్, రాజ్‌కు మార్, మనోజ్,సాగర్, చారి, మూర్తి, సురేష్, భూలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో నేటి నుంచి నిర్వహించే వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అధికారులకు తెలియజేశారు.ఈకార్యక్రమంలో టీపీవో ఆంజనేయులు, రెవెన్యూ అధికారి ఉమాదేవి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ పాల్గొన్నారు.

చిందు యక్షగాన కళాకారిణికి సన్మానం

నవీపేట,జనవరి20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన చిందు యక్షగాన కళాకారిణి పులింటి గోదావరిని సోమవారం ఘనంగా సన్మానించారు. మండల భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల యక్షగాన కళారత్న ఆర్యానీ సకల కళావేదిక జాతీయ పురస్కారాన్ని పొందిన పులింటి గోదావరిని శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్, బండారు రాజశేఖర్, గణేష్, రాము, బాల గంగాధర్, ప్రవీణ్, నర్సింలు, రాధ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లిలో లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను సోమవారం నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరివినోద్, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల మైనారిటీ అధ్యక్షుడు అక్బర్, మండల ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, రిక్కుల సురేష్, గన్న లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, నాయకులు నర్సయ్య, నెహ్రూ, సాయిరాం, రాజేందర్, తుప్పరవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బోధన్‌రూరల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమౌతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ మున్సిపాలిటీ సమావేశపు మందిరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశంలో ఏజెండా 27అంశాలు పొందుపర్చగా అన్ని ఏజెండా అంశాలు చర్చకు వచ్చాయని కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారని ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని అన్ని వార్డులను పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో పట్టణానికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేశామన్నారు. పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ డీఈ విష్ణేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై అవగాహన



డొంకేశ్వర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై చిరంజీవి

డొంకేశ్వర్, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్టయితే రైతుల పంటలకు నీరు అందక ఇబ్బందిపడతారని ఎస్సై చిరంజీవి అన్నారు. సోమవారం డొంకేశ్వర్, నందిపేట మండలాల లిఫ్ట్ చైర్మన్‌లకు ట్రాన్స్ ఫార్మర్ల చోరీలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.రాత్రి సమయ ంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తామని అన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్టయితే వందల ఎకరాల సాగుకు నీరు అందక రైతులు ఇబ్బందిపడ తారని గుర్తుచేశారు. తప్పనిసరిగా ఎత్తిపోతల పథకం వద్ద కాపలాగా వాచ్ మెన్‌ను ఏర్పాటు చేసినట్టయితే చోరీలు జరుగకుండా అరికట్టవచ్చని వివరించారు.

రాజ్యాంగ రక్షణ సభను విజయంతం చేయాలి

రెంజల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): మాలలు అంత ఏకమైన మరో ఉద్యమానికి నాంది పలికి రాజ్యాంగ హక్కులను కాలరాస్తుంటే చూస్తు ఊరుకోవద్దని, మన హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించి అంబేద్కర్ వారసులుగా, భారత రాజ్యాంగ హక్కులను కాపాడుతూనే మాలల ఆత్మ గౌరవాన్ని కాపాడుకునే ఉద్యమంలో భాగంగా ఈ నెల 23న మాలమహానాడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే భారత రాజ్యాంగ రక్షణ సభకు మాలలు అంత తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నాయకులు గంగాధర్, పార్వతి రాజేశ్వర్ పిలుపునిచ్చారు. దళితులను రిజర్వేషన్‌ల పేరుతో వర్గీకరణ చేపట్టి దళితులను వేరు చేయాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రిజర్వేషన్ల పేరుతో వీడదీస్తూ ఉంటూ చూస్తు ఊరుకునేది లేదన్నారు. దళితులందరు సమానంగా ఉండాన్న ఉద్దేశంతో మాలలు అంత ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. వేలాది మంది మాలలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాల మహనాడు నాయకులు క్రాంతి కుమార్, జుట్టు పోశెట్టి, పొత్తుల గంగాధర్, నీరడి నరేష్, బేగరి ముత్యం, నాగయ్య, గైని శ్రీనివాస్, నరేష్, యేవన్, నీరడి చిన్న నాగయ్య, సామెల్, సంతోష్, రాజు తదితరులు పాల్లన్నారు.

లక్కోరలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

వేల్పూర్, జనవరి20(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అక్కోర గ్రామంలో మురికికాలువ నిర్మాణాలకు తహసీల్దార్ సంతోష్ భూమిపూజ నిర్వహించారు. 2021- 22 సంబంధించి 15ఫైనాన్స్ కమిషన్ గ్రాంటు కింద రూ.3లక్షల నిధులతో గ్రామంలో మురికికాలువ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తహసీల్దార్ సంతోష్ తెలిపారు. ఈ కాలనీలో గత కొన్ని రోజులుగా మురికికాలువ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవ హిస్తూ కాలనీప్రజలను దుర్వాసనతో ఇబ్బందిపడేవారని అన్నారు. ఈ డ్రైనేజీ నిర్మించడం వల్ల ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ సొసైటీ వైస్‌చైర్మన్ శ్రీధర్, మాజీఎంపీటీసీ గంగామణి, కార్యదర్శి విజయ్, కాంగ్రెస్ నాయకులు ఆత్మరాం, అడ్వాల చిన్నహన్మాండ్లు, బీజేపీ నాయకులు, వీడీసీసభ్యులు, పాల్గొన్నారు.

నేటి నుంచి మూడు రోజుల పాటు గ్రామ సభలు

ఏర్గట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామాల్లో నేటి నుంచి గ్రామ పంచాయతీ కార్యాల యాల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గ్రామ సభలు నిర్వ హిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు బట్టాపూర్, తాళ్లరాంపూర్‌లో ఉదయం 10 అలాగే ఏర్గట్లలో మధ్యాన్నం 2 గంటలకు, 22న నాగేం ద్రనగర్, తడపాకల్‌లో ఉదయం 10 గంటలకు అలాగే గుమ్మిర్యాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు, 23న దోంచంద, తొర్తి గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

భీమ్‌గల్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోరుకుంటున్నా వారిపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన మాల మహనాడు నాయకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం భీమ్‌గల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16న మాల మహనాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి నాయుడు ఎస్సీవర్గీ కరణ కోరకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులను ఈ దేశం నుంచి బహి ష్కరించాలని భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేసి రెచ్చ గొట్టే ప్రకంపనలు చ ఏయడం రాజ్యాంగానికి విరుద్దమని కనుక తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయ కులు, తదితరులు ఉన్నారు.



కుంభమేళాలో పీఎం, ఎంపీ ఫొటోలకు జలాభిషేకం

నందిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న మహా కుంభమేళలో భాగంగా త్రివేణి సంగమంలో సోమవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి చిత్రపటాలకు నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు జలాభిషేకం చేశారు. ఎన్నో దశాబ్దాలుగా రైతులు ఎదురు చూస్తున్న పసుపు బోర్డును ఏర్పాటు చేసినందుకు పీఎం నరేంద్ర మోది, నిజామాబాద్‌కు పసుపు బోర్డు తెచ్చిన ఎంపీ అర్వింద్, జిల్లాకు చెందిన పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపు బోర్డు చైర్మెన్‌గా ఎన్నికైనందుకు వారి చిత్ర పటాలకు జలాభిషేకం చేశారు. అంతే కాకుండా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చిత్ర పటాలకు సైతం జలాభిషేకం చేశారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఒబీసీ, ఐటి సెల్ కన్వీనర్ మంగ్లారపు నవీన్, ద్యాగ ప్రశాంత్, క్రాంతి, వంశీ కృష్ణ తధితరులు ఉన్నారు.

క్యాంపస్ కబుర్లు

టీయూలో పీజీ, ఎల్‌ఎల్‌బీ పరీక్షలు ప్రారంభం

● తనిఖీ చేసిన వీసీ యాదగిరి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

డిచ్‌పల్లి,జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి ఈ పరీక్ష లను వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలకు 28మంది విద్యార్థులకు గాను 26 విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

టీయూ డైరీని ఆవిష్కరించిన వీసీ



2025 నూతన డైరీని ఆవిష్కరిస్తున్న వీసీ, అధ్యాపకులు

డిచ్‌పల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ 2025 నూతన డైరీని సోమవారం వీసీ యాదగిరి రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. డైరిలో విశ్వవిద్యాలయంకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం, విద్య కార్యక్రమాలు, ఇతర ఉపయోగకరమైన ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. డైరి సమిష్టి కృషిని మన ప్రగతిని మన నిరంతర శ్రమను ప్రతిబింబించే పత్రిక అని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి రాష్ట్ర ప్రభుత్వ సహకరాంతో వర్సిటీని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని తెలియజేశారు. ఈ డైరిని అద్భుతంగా తయారు చేయడానికి కృషి చేసిన పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి ని వీసీ అభినందించారు. ఈ ఆవిష్కరణలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్, కంట్రోలర్ అరుణ, యూజీసీ కోఆర్డినేటర్, డీన్ లు అధ్యాపకులు లావణ్య, అపర్ణ, రాంబాబు, సంపత్ రెడ్డి, పాల్గొన్నారు.

టీయూని సందర్శించిన రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



వీసీతో మాట్లాడుతున్న రైతు కమిటీ సభ్యుడు గంగాధర్

డిచ్‌పల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీని రాష్ట్ర కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారచంద్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరి రావును కలిసి వర్సిటీలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీసీని గడుగు గంగాధర్, తా రా చంద్ నాయక్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుభాష్, బంజార సంఘం నాయకుడు సుధా కర్, కాంగ్రెస్ నాయకుడు ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రియం.. నాటు కోడి కూర!



గ్రామీణ ప్రాంతాల్లో పెంచుతున్న నాటు కోళ్లు

● గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన కోళ్ల పెంపకం ● నాటు కోడిలో కొవ్వు నిల్.. పోషకాలు ఫుల్
● నాటు కోడి రుచిపై మక్కువ చూపిస్తున్న యువత

మెండోర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు చిన్నపాటి శుభకార్యం జరిగినా కోడి పుంజులు కోసి దావత్ చేయడం ఆనవాయితీగా వ స్తుండేది. కాలక్రమేనా పౌల్ట్రీ పరిశ్రమ గ్రామాలకు వి స్తరించడంతో చికెన్ లభ్యత విపరీతంగా పెరిగింది. బా యిలర్ కోళ్లలో అధిక మోతాదులో ఉండే కోవ్వు అనేక అనారోగ్యాలకు కారణమవుతుండడంతో కోవ్వు లేని రుచికరమైన చికెన్ కోసం మాంసం ప్రియులు దేశివాలి కోళ్ల వైపు జనం పరుగులు తీస్తున్నారు. అస లే చలికాలం ఇంకా అనారోగ్య సమస్యలు ముంచు కొస్తున్న తరుణంలో బాయిలర్ కోడి కంటే నాటు కోడి చికెన్‌కు డిమాండ్ పెరిగే కోడి కాస్త హట్ కోడిగా మారింది.

పండుగలు వచ్చాయంటే అధిక రేట్లకు కోళ్ల విక్రయాలు

గ్రామీణ ప్రాంతాల్లో పండగలు వచ్చాయంటే చాలు నాటు కోళ్లను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోడి మంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో పెంచుతున్న నాటుకోడి కొనుగోలు చేయాలంటే ఒక్క నాటు కోడి రూ.600పైగా ఒక్క కోడిని కొనుగోలు చేసి నాటుకోడిని ఆరగిస్తున్నారు. ఇంకొంత మంది ఆ ర్డర్ మెస్‌లలో కేజీ రూ.1200 చెల్లించి నాటు కోడి ఆర్డర్ చెప్పి ఆరగిస్తున్నారు. దీంతో నాటు కోడిలో కొవ్వు శాతం తక్కువగా ఉండడం, పోషకాలు ఎక్కువగా ఉండడంతో నాటు కోడి మాంసం తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. బాయిలర్ కోడి మాట న్‌లతో పోలిస్తే నాటు కోడి ఆరోగ్యానికి మేలు అని వైద్యులు పేర్కొనడమే ఇందుకు కారణం.

నాటు కోడి కూరపై యువత ఎక్కువ

నేడు యువత ముగ్గురు, నలుగురు కలిస్తే చాలు ఖర్చుకు వెనుకడకుండా నాటు కోడి రుచి చూడాలని అట్టే అనుకొని దగ్గరలో ఉన్న ఆర్డర్ మెస్ నిర్వాహకులకు ఆర్డర్ ఇచ్చి నాటు కోడి కూరను ఆరగిస్తున్నారు. నాటు కోడి ధర అధికంగా ఉన్న కానీ ధరలకు వెను కడకుండా రుచి మాత్రం భలే హట్ అంటు మాంసం ప్రియులు లోట్టలు వేసుకొని తింటున్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియో జక వర్గ గ్రామీణ ప్రాంతాల్లో రోజు వేల సంక్యలో నా టుకోడి మాంసం అమ్మకాలు జరుగుతున్నాయి. దీం తో దాబా హోటల్ ఆర్డర్ మెస్‌లలో ఉండే నాటు కోడి రుచి చూడడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.

సహజ సిద్ధమైన వాతావరణం

నాటు కోళ్ల కోసం ఏలాంటి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. కేవలం మన ఇంటి ముందు కాస్త ఖాళీ స్థలం ఉంటే చాలు వాటికి ఏలాంటి దాణా, ఇంజక్షన్‌లు ఇచ్చే అవసరం లేదు. సహజ సిద్ధంగా లభించే గింజలు చిన్న క్రిములను ఆహారంగా తీసుకొని నాటు కోళ్లు పె రుగుతున్నాయి. నాటు కోడి మాంసంలో



కొవ్వు శాతం పూర్తిగా తక్కువగా ఉండడం పోషకాలు అధికంగా ఉండడంతో వైద్యులు నాటు కోడి మాంసం తినడం మంచిదని చెబుతున్నారు. బాయిలర్ కోడి మటన్‌లతో పోలిస్తే నాటుకోడి ఆరోగ్యానికి మంచిదని తెలుసుకున్న మాంసహారులు నాటు మాంసంపై మక్కువ చూపుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన కోళ్ల పెంపకం..

గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నాటు కోళ్ళ పెంచడాన్ని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గ మండలాల్లో నిత్యం నాటు కోళ్ల విక్రయాలు వేళల్లో జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్లు సహజ సిద్ధంగా పెరగడంతో వీటిని తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. అంతేగాకుండా నాటు కోడి బరువు పెరగడానికి ఇంజక్షన్‌లు ఇవ్వకపోవడం వాటికి ఆహారం బియ్యం, మొక్కజొన్న, జొన్న, గింజలు వేయడంతో నాటు కోళ్లు బరువు పెరుగుతున్నాయి. దీంతో కోడి మాంసం ధర ఘాటెక్కిన రుచి మాత్రం భలే పసందు అంటు న్నారు మాంసం ప్రియులు.

దేశికోడికి సాటి లేదు..

● పటేల్ నవీన్, మెండోర



మాంసం ప్రియుల్లో నాటు కోడి చికెన్‌ది ప్రత్యేక స్థానం. ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బాయిలర్ చికెన్ తో పోల్చుకుంటే నాటు కోడి చికెన్ ఎంతో శ్రేష్ట మైనది, పండగలు వచ్చిన ప్పుడు నాటుకోడి రేటు ఎంతైనా సరే అన్ని కోళ్లను కొనుగోలు చేసి నాటు కోడి రుచి చూస్తున్నాం. యువత కూడా కోడి ఎక్కువ రేటు పెట్టి తినాలని కోరిక ఉండడడంతో దేశీకోళ్ల రుచి వైపు చూస్తున్నారు.

గురుకుల ప్రవేశాలకు వేళాయే

మీ కోసం



ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనం

● 5 నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాలు ● ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుల స్వీకరణ
● ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ● దరఖాస్తుల సమర్పణలో స్వల్ప మార్పులు

ఎల్లారెడ్డి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకుల, మహాత్మా జ్యోతిబాపూలే, సాధారణ సంక్షేమ గురుకుల, మహాత్మాజ్యోతిబాపూలే, సాధారణ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 5వ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చేరే విద్యార్థులు ఎవరైనా దర ఖాస్తు చేసుకోవచ్చు. ఈ క్రమంలోని ఈసారి చేరికల్లో కొన్ని మార్పులు చేసింది. గతంలో ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ఈ ఏడాది నుంచి కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ముందే సమర్పించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో ఐదవ తరగతి ఒకసారి 6 నుంచి 9వ తరగతులకు, మరోసారి దరఖాస్తులను స్వీకరించేవారు. అర్హత పరీక్షలు సైతం వేర్వేరు తేదిల్లో నిర్వహించేవారు. కాని ఈ ఏడాది నుంచి అందరికీ ఒకేసారి దరఖాస్తులను స్వీకరించి అర్హత పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సద్వినియోగం చేసుకోవాలి



గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన వసతితో కూడిన విద్య అందుతుంది. ప్రస్తుతం ప్రవేశాలల ఐదవ తరగతితో పాటు ఆరు నుంచి తొమ్మిది వరకు తరగతుల్లో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేసేందుకు కూడా ఒకేసారి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కావాల్సిన ధ్రువ పత్రాలతో మీ సేవా కేంద్రాలకు తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– గంగారాం నాయక్, ఆర్‌సీవో, నిజామాబాద్ మెదక్ ఉమ్మడి జిల్లా

● మొదలైన దరఖాస్తుల స్వీకరణ

2024 డిసెంబర్ 21వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఫిబ్రవరి 1వ తేదీన దరఖాస్తులకు చివరి గడువు నిర్ణయించారు. ఇదే నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నా రు.

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ముందుగా మీ సేవ కేంద్రాల ద్వారా కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది.

అవసరమైన సర్టిఫికెట్లు

ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనోఫైడ్ లేదా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాటు మొబైల్ నెంబర్ ఒక దరఖాస్తుకు మాత్రమే పని చేస్తుంది. ఓటీపీతో లాగిన్ అవ్వాలి.

● విద్యార్థి ఫోటోతో పాటు గ్రామీణ ప్రజల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు ఉండాలి. పట్టణ ప్రజల వార్షిక ఆదాయం రూ. రెండు లక్షల లోపు మాత్రమే ఉండాలి.

తేలుతున్న రైతు భరోసా లెక్క



మద్నూర్‌లో వెంచర్ భూమి సర్వే చేస్తున్న అధికారులు

మద్నూర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం అమలు చేయబోతున్న రైతు భరోసా పథకానికి సంబంధించిన క్షేత్ర స్థాయి సర్వే జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతుంది. సాగుకు పనికిరాని భూములను గుర్తించేందుకు గ్రామ స్థాయిలో చేపట్టిన ఈ సర్వేలో అర్హుల జాబితా పక్కాగా తేలుతుంది. అనేక చోట్ల సాగుకు పనికిరాని భూములు బయటపడుతున్నాయి. జిల్లాలో ఇప్పటికీ సర్వే జరిగిన గ్రామాల్లో 10 నుంచి 15 శాతం సాగులో లేనట్లు తెలుస్తుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం లో భూములు తమ ఆధీనంలో లేకపోయినా సాగుకు పనికి రాక పోయినా అనేకమంది పెట్టుబడి సాయం పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో సాగు భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందజేస్తా మని ప్రకటించి క్షేత్ర స్థాయిలో అధికారుల చేత సర్వే చేయిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో క్షేత్రస్థాయిలో పరిశీల లేకుండానే ధరణి ప ట్టాదారు పాసు పుస్తకాలను పరిగణలోకి తీసుకొని నేరుగా రైతుల ఖాతా లకు ప్రభుత్వం సొమ్ము జమ చేశారు. దీంతో ప్రతి గ్రామంలోనూ సాగు లో లేని భూములకు రోడ్లు, భవనాలకు సైతం రైతుబంధు ఇచ్చారు. ఈ పరిస్థితిని మార్చి ప్రస్తుత ప్రభుత్వం సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇచ్చేందుకు క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. గత ఐదు రోజులుగా జరుగుతున్న సర్వేలో ప్రతీ గ్రామంలోనూ అనేక వాస్తవాలు వెలుగు చూ స్తున్నాయి. భూములు ఆధీనంలో లేకపోయినా రైతుబంధు పొందు తున్న రైతుల జాబితా సర్వేలో బయటపడుతుంది. ప్రతి గ్రామం నుంచి 20 నుంచి 30 ఎకరాల భూమి లేకపోయినా రైతుబంధు నిధులు జమ చేసినట్లు తేలుతుంది. అదేవిధంగా గుట్ట భూములు ఉన్నా కూడా సా గు భూమి కింద రైతుబంధుపొందారు. ఇప్పటివరకు సర్వే చేసిన భూముల్లో 10 నుంచి 20 శాతం వరకు రికార్డులో ఉండి వాస్తవంగా లేని భూములు సాగుకు పనికిరాని భూములు ఉన్నట్లు తేలుతుందని సర్వే లో పాల్గొంటున్న అధికారులు చెబుతున్నారు. మద్నూర్ మండలం ఆవల్ గావ్ గ్రామంలో 2945 ఎకరాల భూమికి గతంలో రైతుబంధు సహాయం అందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలో 22 ఎకరాల్లో రాళ్ల గుట్టలు ఉండగా, 23 ఎకరాల్లో ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. సుల్తాన్‌పేట్ గ్రామంలో 1320 ఎకరాలకు గతంలో రైతుబంధు పడగా సర్వేలో 106 ఎకరాల భూమి తగ్గుతున్నట్లు సర్వే అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పెద్ద శక్కర్గలో 2045 ఎకరాలకు రైతుబంధు పొందగా అందులో 19.31 ఎకరాలు హౌసింగ్, 25.17 ఎకరాల్లో రాళ్ల గుట్టలు, ఐదు ఎకరాల్లో రియల్ ఎస్టేట్ ఉన్నట్లు తేలింది. అంతాపూర్‌లో 433 ఎకరాల సాగుభూమి ఉన్నట్లు రైతుబంధు పొందగా 45.8 ఎకరాలు తగ్గుతున్నట్లు తెలుస్తుంది. ఇలా చిన్న గ్రామాల్లో 10 నుంచి 20 ఎకరాలు, పెద్ద గ్రామాల్లో 20 నుంచి 30 ఎకరాల పైగా రియల్ వెంచర్లుగా మారినట్లు సర్వేలో తేలుతుంది. మండల కేంద్రాలకు దగ్గర్లో ఉన్న పెద్ద గ్రామాల్లో ఈ లెక్క మరింత పెరిగే అవకాశం ఉంది.

జర దేఖో!!



భీమ్‌గల్‌లో నిరుపయోగంగా మారిన నూతన ఆర్టీసీ బస్టాండ్

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు!

● నిరుపయోగంగా భీమ్‌గల్ నూతన ఆర్టీసీ బస్టాండ్

భీమ్‌గల్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తరాలు మారిన తలరాత మారదు అన్నట్టు ప్రభుత్వాలు మారిన నూతన బస్టాండ్ పరిస్థితి మాత్రం మారడం లేదు. మండల ప్రజల రవాణా సౌకర్యార్థం నిర్మించిన నూతన బస్టాండ్ ఏ ఒక్క నాయకుడు పట్టించుకోకపోవడంతో అక్కడ పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలలో చెట్లే ఏపుగా పెరిగాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పట ముఖ్యమంత్రి ఎన్‌టీ.రామారావు, ఆర్మూర్ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ హయాంలో భీమ్‌గల్ మండల ప్రజల రవాణా కోసం నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి శరవేగంగా పనులు పూర్తి చేశారు. దీంతో పట్టణ ప్రజలు, వ్యాపారస్థులు ఇరుకు బస్టాండ్ ఇబ్బందులు తొలగిపోతాయని సంతోషించారు. కానీ నూతన బస్టాండ్ కొనసాగించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవ్వడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. 2013సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ, ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ చేతుల మీదుగా బస్టాడ్‌ను మరమ్మత్తులు చేపట్టి ప్రారంభించారు. కొన్ని రోజులు కూడా బస్టాండ్ కొనసాగలేదు. దీంతో ప్రజలకు నూతన బస్టాండ్ అందని ద్రాక్ష గానే మిగిలింది.

పాత బస్టాండ్‌లో ఇబ్బందులు

భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గల పాత బస్టాండ్ ఇరుకుగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పైగా ప్రైవేటు వాహనాలు స్టేట్ రోడ్డుపైనే పెట్టడంతో నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పైగా ఇక్కడ ప్రజలకు కావల్సిన మూత్రశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయానికులకు పాట్లు తప్పడం లేదు.

ఆర్టీసీ అధికారులు పట్టింపే లేదు

నూతన ఆర్టీసీ బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో బస్టాండ్‌లో నిర్మించిన కంట్రోలర్ గది ప్లాట్‌ఫాంలో పూర్తి శితిలావస్థకు చేరుకున్నాయి. పైగా రాత్రి వేళల్లో మందుబాబులకు పగటిపూట హమాలీలకు అడ్డాగా మారింది. మద్యం ప్రియులు మద్యం బాటిళ్లను పగులగొట్టడంతో ఏటుచూసినా సిసాలు, కాసులు దర్శనమిస్తున్నాయి.



శిథిలావస్థలో కంట్రోలర్ గది



భీమ్‌గల్‌లో ముళ్ల పొదల మధ్య బస్టాండ్ శిలాఫలకం

నల్లవెల్లి స్కూల్‌లో అడ్డగోలు వసూళ్లు

● ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్న వైనం
● ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు



నల్లవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల

ఇందల్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు ఉన్నారు. తగినంత ఉపాధ్యాయులు ఉన్నా చదువు లో మాత్రం విద్యార్థులు రాణించడం లేదు. అదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు తల్లిదండ్రులపై అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూల్‌కు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులను డబ్బులు అడుగుతున్నారని పలు విమర్శలు వస్తున్నాయి. పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో పలు సార్లు తల్లి దండ్రుల నుంచి స్కూల్ అభివృద్ధి కోసం అంటూ డబ్బులు వసూలుచేసిన సందర్భాలు ఉన్నాయి.

స్పోర్ట్స్ డ్రెస్‌కు రూ.500లు వసూలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ కావాలని తల్లిదండ్రులు ఖచ్చితంగా కొనివ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో ప్రతి విద్యార్థి నుండి రూ.500లు ముక్కుపిండి మరీ వసూలు చేశారు. గత సంవత్సరం 2023-24 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు మెమో, బోనాఫైడ్ కోసం స్కూల్‌కు వస్తే వారి వద్ద నుంచి రూ.100 నుంచి 200లు వసూలు చేశారని విద్యార్థులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి తల్లిదండ్రుల నుండి రూ.10వేలు, నల్లవెల్లి గ్రామానికి చెందిన మరో విద్యార్థి తల్లి దండ్రుల నుంచి బీరువా కొనివ్వాలని ఒత్తిడి తేవడంతో ఏం చేయాలో తోచక రూ.7వేల విలువగల బీరువాను కొనివ్వడం జరిగింది.

స్కూల్‌డే కోసం వసూళ్లు

ఈ నెల 24న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. స్కూల్‌డే జరపాలని పట్టుదలతో ప్రధానోపాధ్యాయురాలు స్కూల్ పేరుతో డొనేషన్ బుక్ ప్రింట్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటింటికి తిరుగుతూ ఉపాధ్యాయులు డబ్బులు వసూలు చేస్తున్నారని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. క్లాసులను ఎగ్గొంటి నల్లవెల్లి, గౌరారం, లింగాపూర్, సిర్నాపల్లి గ్రామాల్లో తిరుగుతూ గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా నల్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది విద్యార్థులపై శ్రద్ధపెట్టి నాణ్యమైన విద్యా బోధన విద్యార్థులకు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు చదువులో మార్పు రావాలి

● నీరడి మనోహర్, గ్రామస్థుడు



ఆరు నుంచి పది వరకు విద్యార్థుల చదువులో మార్పు రావాలి. హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో విద్యార్థులకు చదవడం, రాయడం రావడం లేదు. ఉపాధ్యాయులు చదువులపైన శ్రద్ధ చూపాలి. ఉపాధ్యాయులు చదువులపైన శ్రద్ద చూపకపోతే కష్టమే.

ప్రతీ విద్యార్థిపైన దృష్టి పెట్టాలి

● దామ సుమన్, గ్రామస్థుడు



ప్రతీ తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. రానున్న పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలంటే ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం

● జిల్లా విద్యా అధికారి అశోక్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చదువులపైన దృష్టి పెట్టాలి. పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వివిధ కారణాల పేరుతో ప్రభుత్వ పాఠశాలలు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటా.

సిరికొండలో కస్తూర్బా పాఠశాల తనిఖీ



సిరికొండ కేజీబీవీలో వంట గదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సిరికొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అన్నపూర్ణ కాలనీలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం అదనపు కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. స్టోర్‌లో ఉన్న కూరగాయలు, బియ్యాన్ని, వంట సామాగ్రిని దగ్గరుండి పరిశీలించారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రత్యేక అధికారిని ఆదేశించారు. అంతకు ముందు పాఠశాల ప్రత్యేక అధికారి సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదని వీటిని బాగు చేయించాలని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఏఏ సమస్యలున్నా నివేదిక రూపంలో పంపించాలని విద్యార్థులకు విద్యాబోధన బాగా చేయించాలని ప్రభు త్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. ఆయన వెంట ఎండీవో మనోహర్‌రెడ్డి, తహశీల్దార్ రవీందర్‌రావు ఉన్నారు.

● రేషన్ కార్డుల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

రామడుగు గ్రామంలో జరుగుతున్న రేషన్ కార్డుల సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు.పంచాయతీ సెక్రెటరీ,సర్వే బృందాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు.

రేషన్ కార్డులు అందరికీ అందేలా చూడాలి



పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

ఇందల్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ కార్డులేని నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు అందేలా చూడాలని ఎంపీడీవో లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూమిలేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఉపాధి కార్డు కలిగి కనీసం 20 రోజులు పనిదినాలు చేసిన వారిని గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి దరఖాస్తు చేసుకున్న జాబితాను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. రైతుభరోసాకు అర్హులైన రైతులకు ప్రతీ ఒక్కరికి రైతుభరోసా అందేలా చూడాలని ఇప్పటి వరకు సర్వే చేసిన జాబితాను కంప్యూటర్‌లో ఎంట్రీ పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకట్రావు, ఎంపీవో రాజ్‌కాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హరిచరణ్ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

నిజామాబాద్‌అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):నగరంలోని హరిచరణ్ జూనియర్ కళాశాలను సోమవారం డీఐఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాలలో విద్యాబోధనతో పాటు పరిసరాలను పరిశీలిం చా రు. అధ్యాపకుల విద్యాబోధన గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనం త రం అధ్యాపకులు, ప్రిన్సిపల్, సిబ్బందితో సమావేశమయ్యారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వార్షిక పరీక్షలకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థుల వివరాల సవరణకు అవకాశం ఉందని అదేవిధంగా కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలన్నారు.

'కవితపై బీజేపీ నాయకుల వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు విజయలక్ష్మి

సుభాష్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్‌కేవీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలో కవిత నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. పసుపు బోర్డుకు సంబంధించి పార్టీ ఎమ్మెల్యేలను తీసుకొని ఐదుగురు ముఖ్యమంత్రులను కలిసిన ఘనత కవితకు ఉందన్నారు. ప్రస్తుతం మేయర్ పదవి ఇస్తారని కొత్త విషయం చెబుతున్నారని అన్నారు. నీస్థాయి ఏందో ప్రజలకు తెలుసు అని మీనాయకుడు నువ్వు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, సావిత్రి, ప్రసాద్, శేఖర్‌రెడ్డి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అవగాహన శిక్షణ తరగతులు వాయిదా

సుభాష్‌నగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జనవరి 20, 21, 22 తేదీల్లో జరగాల్సిన రాజకీయ సామాజిక అవగాహన శిక్షణ తరగతులు అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగుల గోవర్ధన్, పెద్ది వెంకట్రాములు తెలిపారు. సమావేశంలో మాట్లాడుతూ ప్రజాసమస్యల ఉద్యమాల వల్ల రాజకీయ సామాజికశిక్షణ తరగతులు వాయిదా వేసుకోవాల్సి వస్తుందన్నారు.ఈ సమావేశం ఫిబ్రవరి 15,16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సాయిలు, సీను,శంకర్, అశోక్, సూరి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కంజర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మోపాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశారు అంటూ 25 ఏళ్ల కిందట చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఒకచోటికి వచ్చారు. మోపాల్ మండలం కంజర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-21బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.పూర్వవిద్యార్థులు తమ కుటుంబసభ్యులతో ఆనందంగా జీవించాలని కోరారు. పూర్వవిద్యార్థులందరూ ఒకచోట కలవడంతో ఆనందాన్ని పంచుకున్నారు.

గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి,

నిజామాబాద్‌అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్ల పాటు విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. గత సెప్టెంబర్ నెలలో జిల్లాలో వర్షాల కాలంగా వాయిదాపడిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర వ్యవ సాయ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, డీఈవో అశోక్, తదితరులు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విద్యావ్యవస్థను ఒక్కోక్కటిగా ఈ ప్రభుత్వం చక్కదిద్దుతుం దన్నారు. గత బడ్జెట్‌లో 22వేల కోట్లు ప్రభుత్వం విద్యావ్య వస్థకు కేటా యించిందని అన్నారు. త్వరలో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం అంద జేస్తామని, కాస్మోటిక్ చార్జీలు,మెస్‌చార్జీలు పెంచిన ఘనతకాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.ప్రతీ నియోజకవర్గంలోఇంటిగ్రేటెడ్ స్కూ ళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ఉపాధ్యాయులే దేశ నిర్మాతలన్నారు. ప్రభు త్వం ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేసేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి సీతయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి,కిషన్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్,టీఎస్‌యూటీఎఫ్ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు రమేష్, గంగాధర్, గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మోహన్, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మోపాల్: స్వచ్ఛంద సంస్థలు పేదల కోసం సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మాధవనగర్, పాంగ్రా కెనాల్ కట్ట వద్ద నిరుపేదలకు ప్రియదర్శిని మహిళా కన్జూమర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సిలివేరి నాగమణి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను ఉచితంగా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి ఈ సంస్థ స్వచ్ఛందంగా సేవ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. మునుముందు పేదల కోసం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమం లో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాధవనగర్ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రావు, నాయకులు సాయరెడ్డి, పార్టీ అధ్యక్షులు సాయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తరుణ్, ఎల్లయ్య, మల్లయ్య, నర్సింలు, సంస్థ సభ్యులు లక్ష్మి, శారద, రాణి, వసంత, సుమ, అనిల్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డిగ్రీ కళాశాలల ప్రతినిధులు



కలెక్టరేట్‌కు వచ్చిన డిగ్రీ కళాశాలల ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే కళాశాలలను నడపలే మని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వేలాది మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిన తమకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపో వడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గత సంవత్సరం కాలం నుంచి సిబ్బందికి జీతభత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని అద్దె భవనాల్లో కొనసాగుతున్న కళాశాలలు అద్దె చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు నరాల సుధాకర్, శ్రీనివాస్, అరుణ్, సంజీవ్, హరికృష్ణ, గంగాధర్, రాజేందర్, హరిప్రసాద్, తదితరులు ఉన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

మోపాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో రాములు నాయక్ గ్రామస్థాయి అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమపథకాలను గ్రామసభల్లో ప్రజలకు వివరించాలని అన్నారు.ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పేర్లను ఈసందర్భంగా వివరించాలని సూచించారు.గ్రామస భలకు గ్రామప్రజలుఅందరూ హాజరయ్యే విధంగా గ్రామాల్లో దండోరా వేయాలని అన్నారు. సభలకు అందరూ అధికారులు హాజరు కావా లని ఆదేశించారు.

నేటి నుంచి గ్రామసభలు

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేయనున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ పథకాల అమలు కోసం జిల్లా వ్యా ప్తంగా మంగళవారం నుంచి అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించ నున్నారు. గ్రామసభల ద్వారానే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయను న్నారు. ఈమేరకు జిల్లా యంత్రాంగం అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీ య భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం ఈ ప్రత్యే క సమావేశాలను నిర్వహించనున్నారు.గ్రామప్రత్యేక అధికారుల పర్య వేక్షణలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న వాటిని స్వీకరించనున్నారు. ఇప్పటికే అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు ఎప్పుడు నిర్వహిస్తామనే విషయాలను గ్రామస్థులకు తెలియజే శారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

డిచ్‌పల్లి: మండలంలో ఈ నెల 21నుంచి 24వరకు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలునిర్వహించేందుకు 4టీములను ఏర్పాటు చేశామని ఈ గ్రామ సభలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రభాకర్, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. 21న ధర్మారం(బి), దూస్‌గాం, నక్కల గుట్ట తాండ, నడిపల్లి, నడిపల్లి తాండ,కోరట్‌పల్లి, కోరట్‌పల్లి తాండ,రాంపూర్, నర్సింగపూర్, 22న మెంట్రాజ్‌పల్లి, నక్కల గుట్ట తాండ, దేవపల్లి, సుద్దపల్లి, డిచ్‌పల్లి, డిచ్‌పల్లి తాండ, యానంపల్లి, యానంపల్లి తాండ, సాంపల్లి, సాంపల్లి తాండ, 23న ఘన్‌పూర్, వెస్లినగర్ తాండ, అరెపల్లి, బర్దిపూర్, ము ల్లంగి, సుద్దులం, మిట్టపల్లి, మిట్టపల్లి తాండ, 24న అమృతపూర్, గొల్లపల్లి, దేవ నగర్ క్యాంపు, బీబీపూర్, బీబీపూర్ తాండ, కమలపూర్, గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని ఇందుకు 4టీములను ఏర్పాటుచేశామని తెలిపారు.

రెంజల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నాలుగు పథకాలలో భాగంగా అర్హులందరికీ పథకాలు అందే విధంగా గ్రామాలలో నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందని సూపరిండెంట్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. 21న అంబేద్కర్ నగర్, బాగేపల్లి, బోర్గాం, దండిగుట్ట, 22న దూపల్లి, కల్యాపూర్, కందకుర్తి, కిసాన్ తండా, 23న కూనేపల్లి, మౌలాలి తండా, నీలా, పేపర్‌మిల్, 24న రెంజల్, సాటాపూర్, తాడ్‌బిలోలి, వీరన్న గుట్ట తండాలలో గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నాలుగు పథకాలను ప్రతీ ఒక్కరికి అందించాలన్న ఉద్దేశంతో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందని, గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోపాల్:మండలంలోని ఆయా గ్రామాల్లో మం గళవారం నుండి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాములు నాయక్ తెలిపారు. గ్రామ సభల్లో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల పేర్లను కూడా ఈ సందర్భంగా చదవడం జరుగుతుందని తెలిపారు. గ్రామసభలకు మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ స్థాయి అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు గ్రామసభలకు హాజరుకావాలని కోరారు.

వేల్పూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21న నుంచి 24వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తేదీల వారీగా గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సంతోష్ తెలిపారు. 21న అంక్సాపూర్, కోమన్‌పల్లి, కొత్తపల్లి, అమీనాపూర్, లక్కోర, అక్లూర్, పడిగెల, 22న కుకునూర్, వెంకటాపూర్, సాహెబ్‌పేట్, మోతె, రామన్నపేట్, వేల్పూర్, 23న జాన్కంపేట్, వాడి, 24న పచ్చలనడ్కుడ, పోచంపల్లి, పడిగెల హన్మాన్ నగర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ గ్రామసభలను తహసీల్దార్ సంతోష్, డీటీ మధు, ఎఎస్‌వో ప్రణీత, సీనియర్ అసిస్టెంట్ స్వాతి, ఆర్ఐ గోపాల్, తదితరులు వివరిస్తారన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సతీష్‌కుమార్ తెలిపారు. గ్రామ సభలో ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందజేయనున్న రైతు భరోసా, రేషనకార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళ కోసం అర్హులైన ప్రజలు ఈ గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 21న బాలనగర్, గన్యతాండా, పుప్పాలపల్లి, మాదాపూర్, నల్లగుట్టతాండా,వివేక్‌నగర్‌తాండా,సికింద్రాపూర్, చందమియాబాగ్‌తాండా, 22న లక్ష్మాపూర్, అర్గుల్, నారాయణపేట్, కలిగోట్, చింతలూర్, కేశ్‌పల్లి, పడకల్, కొలిప్యాక్, 23న జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, మునిపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలో నేటి నుంచి గ్రామస్భలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సుమలత తెలిపారు. 21న దర్మోరా, పాలెం, తిమ్మాపూర్ ఉదయం 9నుంచి గ్రామస్థులు ప్రారంభమవుతాయని తెలిపారు. 22న దొన్కల్, సుంకెట్, వడ్యాట్, 23న దొన్‌పాల్, శెట్‌పల్లి, 24న మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామాల్లో జరుగుతాయని తెలిపారు. గ్రామసభలో అధికారులు సర్వే చేసిన రేషన్‌కార్డుల లబ్ధిదారుల వివరాలు, ఇందిరమ్మ ఇళ్ళలబ్ధిదారులు,రైతుబంధు, తదితర విషయాలపై అధికారులు సర్వే వివరాలు వెల్లడిస్తారని,గ్రామస్థులకు సమస్యలు వివరించాలని ఎంపీడీవో తెలిపారు.

ముప్కాల్:రాష్ట్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రజా సంక్షేమం కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళ పథకాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.ముప్కాల్ మండలంలో 21న కొత్తపల్లి, వేం పల్లి, నాగంపేట్, 22న నల్లూర్, వెంచిర్యాల్, రెంజర్ల, 24న ముప్కాల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నరేష్ ఆనంద్ తెలిపారు.

బాల్కొండ మండలంలో

బాల్కొండ మండలంలో ఈనెల 21న శ్రీరాంపూర్, చిట్టాపూర్, వన్నెల్ (బి), బోదేపల్లి, 22న కిసాన్‌నగర్, బస్సాపూర్, ఇత్వార్‌పేట్, జలాల్ పూర్, 23న నాగాపూర్, బాల్కొండ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించన న్నట్టు ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం నుండి ఈ నెల 24వరకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో నాగనాథ్ తెలిపారు. ఈ నెల 21న అభంగపట్నం, అబ్బాపూర్(బి), గాంధీనగర్, ఆశాజ్యోతి కాలనీ, అనంతగిరి, బినోల, హనుమాన్ ఫారం, లింగాపూర్, ఫత్తేనగర్, 22న ధర్మారం, కమలాపూర్, మోకన్‌పల్లి, కోస్లీ, మద్దెపల్లి, మహంతం, నాగేపూర్, మట్టయ్య ఫారం, మిట్టాపూర్, నాళేశ్వర్, 23న నవీపేట, రాంపూర్, పోతంగల్,నందిగాం, నిజాంపూర్,నాడాపూర్, సిరన్‌పల్లి, శివ తండా,యంచ, తుంగిని, 24న స్టేషన్ ఏరియా, జన్నేపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల అంశాలపై గ్రామసభలలో చర్చించడం జరుగుతుదని ఆయన వివరించారు.

భీమ్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులపై మున్సిపల్ పట్టణ కేంద్రంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ రామకృష్ణ తెలిపారు. 21న స్వర్ణకార విశ్వబ్రాహ్మణ, షాదిఖానా బాపూజీ నగర్, మహిళ సంఘ భవనంలో, 22న మున్నూరు కాపు ఎస్సీవాడ, వీడీసీ మహిళ భవనంలో, 23న కర్నెగల్లీ, చిన్నబోదిరె గల్లీ యూత్, షాదిఖానా, ఎర్రోడిగల్లీ సంఘ భవనాలలో నిర్వహించనున్నట్టు కమిషనర్ తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డిచపల్లి,జనవరి 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేత నిర్వ హించబడుతున్న సాంఘిక సంక్షేమ, గిరిజనసంక్షేమ, మహాత్మాజ్యోతి బాపూలే, వెనుక బడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాల లో 2025-26 సంవత్స రానికి 5వ తరగతి నుంచి 9వ తరగతుల్లో ప్రవే శానికి ప్రవేశ పరీక్ష టీజీసెట్ -2025కు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరి స్తున్న ట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్‌రాణి ఒక ప్రక టనలో సోమవారం తెలిపారు.4,5,8 తరగ తులు చదువుతున్న ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ ఆర్థికంగా వెనుక బడిని విద్యా ర్థులు ఈప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. తల్లి దండ్రుల వార్షిక ఆదా యం రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షల లోపు ఉండాల న్నారు. ఆసక్తి అర్హత గల విద్యార్థులు తమ కుల, ఆదాయ ధ్రువీ కరణ పత్రాలు, పుట్టిన తేదీ పత్రాలతో ఆన్‌లైన్ లో 100రూ. చెల్లించి దర ఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసు కున్న పాఠశాల ప్రాధాన్యత ప్రకారం ప్రవేశాలు కల్పించబడుతాయని ఎంపికైన వారికి ఆంగ్ల బోధనతో పాటు వసతి ఉచిత భోజనం ఉంటా యన్నారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్ లను సంప్రదించాలని దరఖాస్తులు సమర్పించేందుకు ఫిబ్రవరి 1 చివరి తేదీ అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుదని తెలిపారు.

గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భాండాగారాలు



రెంజల్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

రెంజల్,జనవరి20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక విజ్ఞాన భండాగారాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. సోమవారం రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని, గ్రంథాయాలను డిజిటల్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతకు అనేక రకాలుగా గ్రంథాయాలు ఉపయోగపడుతున్నాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రెంజల్ గ్రంథాలయాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ నాయకులు గైని శివకుమార్, సాయిలు ఉన్నారు.

సిద్ధులగుట్టపై ప్రత్యేక పూజలు

పెర్కిట్, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో సిద్ధులగుట్టపైకి విచ్చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ పాటలు పడారు. భక్తులు గుమ్మల ఎర్ర ముత్తెన్న, సుకన్య మహేష్ దంపతులు గుట్టపైకి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సభ్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, పీసీగంగారెడ్డి, మల్లయ్య, పి.చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, సతీష్, సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దు



శివాజీనగర్‌లో విద్యార్థులతో రోడ్డు భద్రత అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించడమేనని మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ అన్నారు. సోమవారం నగరంలోని శివాజీనగర్‌లోగల రామకృష్ణ ఉన్నత పాఠశాలలో జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు బైకులు నడపొద్దని, హెల్మెట్ లేకుండా, లైసెన్స్ లేకుండా, సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చే యవద్దన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రాహుల్, ఐరాడ్ జిల్లా మేనేజర్ వర్ష, నిహంత్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి హత్య



గుర్తు తెలియని మృతదేహం

మోపాల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు స్మశాన వాటిక వద్ద 35 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తిని హత్యచేసి పూలాంగ్ కాలువలో పాడేసి వెళ్లిపోయారు. స్థానికులు పోలీసులకు సోమవారం మధ్యాహ్నం సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన అక్కడికి వెళ్లారు. యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి కాలువలో పడేసి వెళ్లిపోయినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.260	రూ. 280



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80800	రూ.74500	రూ.950

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.10, 1.10, 4.10, 7.10, 10.10)
స్క్రీన్-2 : డాకు మహారాజ్ (10.20, 1.25, 7.35, 10.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (4.30)
స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (12.00, 3.20, 6.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (10.00)
స్క్రీన్-4 : ఎమర్జెన్సీ (హిందీ) (12.00)
: ఆజాద్ (హిందీ) (3.05, 10.15)
: పుష్ప-2 (6.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.45, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (1.10, 4.20, 7.35, 10.35)
స్క్రీన్-3 : డాకు మహారాజ్ (11.00, 1.40, 4.30, 7.35, 10.30)

దేవి: డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్